www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 29 ఫిబ్రవరి 2024

5

చిత్తూరు



మళ్లీ తెరపైకి కలత్తూరు కృపా లక్ష్మి!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జీడి నెల్లూరు నియోజకవర్గంలో రకానికి ఒక పేరు మారుతుంది. ఊసరవెల్లిలా జీడి నెల్లూరు రాజకీయం మారుతోంది. మొదట్లో డిప్యూటీ సీఎం కె నారాయణస్వామి అభ్యర్థిని ప్రకటించారు. నారాయణస్వామి పై వ్యతిరేకత రావడంతో ఆయన కూతుర్ని కలతూరు కృపా లక్ష్మిని అభ్యర్థిగా ప్రకటించారు. ఆ కుటుంబంలో ఎవరైనా ఒకటే కదా మాకందరికీ మోసం చేస్తారు.. వద్దు' అని వైసిపి నాయకులే ధర్నాలు చేశారు. మళ్లీ జగన్మోహన్ రెడ్డి అభ్యర్థిని మార్చారు. చిత్తూరు సిట్టింగ్ ఎంపీ రెడ్డప్పని జీడి నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించారు. 'ఇక్కడ నేను ఓడిపోతాను.. నేను స్థానికుడిని కాను అని' ఆయన చెప్పడంతో డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని చిత్తూరు పార్లమెంట్ కి బదిలీ చేశారు. 'ఇక్కడ నేను గెలవలేను' అని చెప్పడంతో చివరికి ఆమె పెద్ద కుమార్తె కలత్తూరు కృపాలక్ష్మికి సీటు కేటాయించారు.



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఎన్నికల కమిషన్ విధి విధానాలు తప్పని సరిగా పాటించాలి

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

ఎన్నికల కోడ్ ప్రారంభం కాగానే ఎలక్షన్ కమిషన్ విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని ఏడు నియోజక వర్గాలకు సంబంధించి ఎన్నికల మెటీరియల్ డిస్పాచింగ్ సెంటర్‌ల ఏర్పాటు, కౌంటింగ్ కేంద్రంగా చిత్తూరులోని ఇంజనీరింగ్ కళాశాల, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని, అందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు కోరారు. ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియమాలను అనుసరించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా అందరూ సహకరించాలని, ఎన్నికల మెటీరియల్ నియోజకవర్గ కేంద్రాలలోని ఎంపిక చేసిన కేంద్రాల నుంచి విడుదల చేస్తామని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఓటర్లు నమోదు ప్రక్రియ మార్పులు చేర్పులు జరుగుతున్నాయని నామినేషన్ల పర్వం ప్రారంభం అయ్యే వారం రోజుల ముందు వరకు నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించిన తర్వాత కమిషన్ ఆదేశాల మేరకు పని చేయాల్సి ఉంటుందని ఎలాంటి సమస్య లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకునేలా అందరూ సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితాలకు సంబంధించి పలు పత్రికలలో వచ్చిన వార్తలకు ప్రతిస్పందించి విచారణ పూర్తి చేశామన్నారు. క్లెయిమ్స్ ఏవైనా ఉంటే పరిష్కరిస్తామని తెలిపారు. ఎన్నికల మెటీరియల్స్‌కు సంబంధించి నియోజకవర్గ కేంద్రాల నుంచి పంపిణీ చేస్తారని పుంగనూరులోని బిఆర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల నగరి, గంగాధర నెల్లూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్, పూతలపట్టు నియోజకవర్గానికి సంబంధించి శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల నుంచి, పలమనేరుకు సంబంధించి చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి, కుప్పం నియోజకవర్గానికి సంబంధించి ఎంఎస్ గవర్నమెంట్ జూనియర్ కళాశాల నుంచి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తారన్నారు. ఎన్నికల కౌంటింగ్ కు సంబంధించి చిత్తూరులోని రెండు కళాశాలలను ప్రతినిధులకు తెలుపగా ప్రతినిధులు అందరూ శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలను కౌంటింగ్ కేంద్రంగా ఎంపిక చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఎన్నికల సామగ్రి ఇవ్వడం, బ్యాలెట్ బాక్సులు తీసుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ పుల్లయ్య, బిజెపి నుంచి అట్లూరి శ్రీనివాసులు, కాంగ్రెస్ నుంచి ప్రతినిధిగా పరదేశి, ఆప్ నుంచి వినాయకన్, సిపిఎం నుంచి గంగరాజు, వైసిపి నుంచి ఉదయ్ కుమార్, టిడిపి నుంచి సురేంద్ర కుమార్‌లు పాల్గొన్నారు.

కుప్పంలో చంద్రబాబు హవాను


వైసీపీ బద్దలు కొడుతుందా..?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో :

ఇక్కడ నుంచి చంద్రబాబుపై ఎవరు పోటీ చేస్తున్నారు..?, ఎవరు గెలుస్తారనే చర్చలు.. గత మూడు దశాబ్దాలుగా స్థానికంగా కూడా జరిగేవి కావు.. దీనికి కారణం చంద్రబాబు కుప్పంలో పెంచుకున్న ఓటర్లు, నేతల నెట్‌వర్క్. ఏడాదికోసారి మాత్రమే నియోజకవర్గానికి వెళ్లే చంద్రబాబును మూడున్నర దశాబ్దాలుగా గెలిపిస్తున్న కుప్పం సీటు చరిత్ర ఓ సారి చూద్దాం...

చిత్తూరు లోక్‌సభ పరిధిలోకి వచ్చే ఏడు అసెంబ్లీ సీట్లలో కుప్పం నియోజకవర్గం ఒకటి. గతంలో చిత్తూరు లోక్‌సభ సీటును వరుసగా టీడీపీ గెల్చుకోవడంలో కీలకమైన మెజార్టీ అందించిన నియోజకవర్గం కూడా... జనరల్ సీటు అయిన కుప్పంలో మొత్తం 2.15 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం పరిధిలో కుప్పం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాలు ఉన్నాయి. జనాభా పరంగా చూస్తే వన్యకుల క్షత్రియులు ఎక్కువగా ఉన్నారు. ఆ తర్వాత మాల, కురవ, గాండ్ల కులస్తులు ఎక్కువగా ఉంటారు.

కుప్పంలో అసెంబ్లీ ఎన్నికల చరిత్రను ఓ సారి గమనిస్తే.. ఇక్కడ టీడీపీ ఆవిర్భావానికి ముందు ఐదు ఎన్నికలు జరిగాయి. ఇందులో 1962లో కమ్యూనిస్టు పార్టీ, 1967, 1972 ఎన్నికల్లో ఇండిపెండెంట్లు, 1955, 1978లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. 1983లో టీడీపీ ఆవిర్భావం తర్వాత నుంచీ ఇక్కడ ఆ పార్టీదే హవా. టీడీపీ ఆవిర్భావం తర్వాత కుప్పం అసెంబ్లీ సీటుకు మొత్తం 9 ఎన్నికలు జరిగితే ఇందులో అన్నీ టీడీపీయే గెలిచింది. 1983 నుంచి 2019 వరకూ ఇక్కడ టీడీపీయే గెలుస్తూ వస్తోంది. ఇందులో



చంద్రబాబు నాయుడు



ఎమ్మెల్సీ భరత్

రెండుసార్లు 1983, 1985లో టీడీపీ అభ్యర్థి రంగస్వామి నాయుడు గెలిస్తే.. ఆ తర్వాత ఏడుసార్లు చంద్రబాబే గెలిచారు. చంద్రబాబును ఏడుసార్లు గెలిపించిన కుప్పంలో ఈసారి ఆ రికార్డును బ్రేక్ చేసేందుకు వైసీపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కుప్పంలో అభివృద్ధి కార్యక్రమాలు, కేజే భరత్‌ను అభ్యర్థిగా ప్రకటించి, గెలిస్తే మంత్రి పదవి ఇస్తామన్న హామీ, స్థానిక ఎన్నికల్లో గెలుపు వైసీపీని ఇక్కడ ఊరిస్తున్నాయి. అయితే కర్నాటక, తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న ఈ భిన్న పరిస్థితులు ఉన్న అసెంబ్లీ సీటులో చంద్రబాబును ఢీకొట్టి గెలవడం అంత సులువు కాదనేది ఇక్కడ వినిపిస్తున్న మాట.



రాష్ట్ర సీఎస్ జవహర్‌రెడ్డిని కలిసిన ద్రవిడ విశ్వవిద్యాలయ విసి మధుజ్యోతి

అదనపు బడ్జెట్ కేటాయించండి

రాష్ట్ర సీఎస్‌కు ద్రవిడ విశ్వవిద్యాలయ విసి వినతి

ప్రజాశక్తి -గుడిపల్లి

ద్రవిడ విశ్వవిద్యాలయానికి అదనపు బడ్జెట్ కేటాయించాలని ద్రవిడ విశ్వవిద్యాలయ విసి ఆచార్య మధుజ్యోతి రాష్ట్ర సీఎస్ జవర్‌హర్‌రెడ్డిని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిఎస్ జవహర్ రెడ్డిని ద్రవిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ద్రవిడ విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. విశ్వవిద్యాలయానికి అదనపు బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. వర్సిటీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల గురించి ప్రత్యేకంగా ఆయనకు వివరించారు. చిత్తూరు జిల్లాలోని ఏకైక విశ్వవిద్యాలయమైన ద్రవిడ విశ్వవిద్యాలయానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను అనుబంధం చేయాలని వినతి చేశారు. మారుమూల ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలోని ద్రవిడ విశ్వవిద్యాలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని సిఎస్‌ను కోరారు. ఈ మేరకు వారికి వీసీ ఆచార్య కే మధు జ్యోతి వినతి పత్రం అందించారు. వీటిపై రాష్ట్ర సీఎస్ జవహర్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

2,31,197 మంది రైతులకు రూ.46.31 కోట్ల రైతు భరోసా

జెసి పి శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకం ద్వారా జిల్లాకు చెందిన 26,961 మంది రైతులకు రూ.7.5 కోట్లు, రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ద్వారా జిల్లాకు చెందిన 2,31,197 మంది రైతులకు రూ.46.31 కోట్లను ముఖ్యమంత్రి బుధవారం బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాలకు జమచేశారని జెసి పి శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం ఉదయం తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి వర్చువల్ ద్వారా రైతులతో సమావేశం నిర్వహించి అనంతరం వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలకు సంబంధించి వరుసగా ఐదవ ఏడాది, వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ పథకం కింద ఈ ఏడాది మూడవ విడతగా రూ.2 వేల చొప్పున 53.58 లక్షల మంది రైతన్నల ఖాతాల్లో రూ.1,078 కోట్లను, వరుసగా నాలుగో ఏడాది సున్నా వడ్డీ పంట రుణాలు పథకం కింద రబీ 2021–22, ఖరీఫ్ 2022 కి సంబంధించి రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన 10,78,615 మంది రైతన్నలకు రూ.215.98 కోట్ల వడ్డీ రాయితీ సొమ్మును బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. చిత్తూరు కలెక్టరేట్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రామచంద్రా రెడ్డి, మేయర్ ఆముదా, జడ్పీ వైస్ ఛైరపర్సన్ కుమారి రమ్య, స్త్రీ శిశు సంక్షేమ జడ్పీ స్టాండింగ్ కమిటీ ఛైరపర్సన్ భారతి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పెట్టుబడుల కోసం ఆర్థిక సహాయాన్ని 15 అక్టోబర్ 2019 నుండి వైయస్సార్ రైతు భరోసా పిఎం కిసాన్ పథకం అమలు చేస్తోందని, అర్హులైన భూ యజమాని రైతుల కుటుంబాలకు ఈ పథకం కింద లబ్ధిదారులను గుర్తించి వారికి సంవత్సరానికి రూ.13,500 వ్యవసాయ పెట్టుబడి కింద అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకం ద్వారా జిల్లాకు చెందిన 26,961 మంది రైతులకు రూ.7.5 కోట్లు, రైతు భరోసా పీఎం కిసాన్ ద్వారా జిల్లాకు చెందిన 2,31,197 మంది రైతులకు రూ.46.31 కోట్లను ముఖ్యమంత్రి బుధవారం బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాలకు జమచేశారని తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు జిల్లా వ్యవసాయ అధికారి మెగా చెక్కులను రైతులకు అందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెసి పి శ్రీనివాసులు, ఇతర అధికారులు

1న తిరుపతిలో కాంగ్రెస్ బహిరంగ సభ

- బాబు, జగన్ బిజెపి భావజాలంలో కలిసిపోయారు..
- ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే: గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం):

ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉండి శ్రీవారి పాదాల చెంత విభజన ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పి మాట తప్పిన వ్యక్తి నరేంద్ర మోడీ అని సిడబ్ల్యూసి సభ్యులు గిడుగు రుద్రరాజు అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారమిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొని వస్తానన్న జగన్, మరోవైపు చంద్రబాబు మోడీని దూషించి నేడు అధికారం కోసం వారితో పయనం అవుతున్నారంటే చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి ఇద్దరూ బిజెపి భావజాలంలో కలిసిపోయారని స్పష్టమవుతోందన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలు ఏర్పాటు చేసి రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని, అధికారం వస్తే కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసే గ్యారంటీ స్కీములను వివరిస్తూ వస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరుద్యోగుల ధర్నాలో పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి, నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. మార్చి 1న తిరుపతి వేదికగా కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభను నిర్వహించ తలపెట్టిందని, ఈ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్, ఏపీసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, ఇతర ప్రముఖులు ఈ బహిరంగ సభకు హాజరవుతారన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, భాస్కర్, ఏపీసీసీ ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, శ్రీరామమూర్తి, శంకర్, తిరుపతి పట్టణ అధ్యక్షులు యార్లపల్లి గోపి, పిసిసి కార్యదర్శి చిట్టిబాబు, లీలాశ్రీనివాస్, జావేద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

పోటీ తత్వంతో మేధో వికాసం: డిఇవో

ప్రజాశక్తి- వెదురుకుప్పం: పోటీతత్వంతో మేధస్సు వికసిస్తుందని డిఇవో దేవరాజు పేర్కొన్నారు. జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకుని వెదురుకుప్పం హైస్కూల్‌ను డిఇవో బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పోటీ తత్వంతో మేధోవికాసానికి దోహదం చేస్తుందని అప్పుడే కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని పరిశోధనలతోనే వైజ్ఞానిక ప్రగతి మెరుగుపడుతుందని పరిశోధనలపై విద్యార్థులకు ఆసక్తి పెంచడం ఉపాధ్యాయుల కర్తవ్యం అని తెలిపారు. ఈ సందర్భంగా వెదురుకుప్పం హైస్కూలు విద్యార్థులను , ఉపాధ్యాయులను ఇన్‌స్పైర్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం ఇఎన్‌డిపిలో జిల్లా స్థాయిలో తృతీయ ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపిక కావడంపై చాలా ఆనందంగా వుందన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులును మండల విద్యాశాఖ అధికారి మహేశ్వరను, ఉపాధ్యాయులను అభినందించారు.



వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి



ఆర్థిక అక్షరాస్యత పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిఆర్‌డిఏ పీడీ తులసి

మహిళలకు, యువతకు ఆర్థిక అక్షరాస్యత అవసరం

డిఆర్‌డిఏ పీడీ తులసి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్ :

మహిళలకు, యువతకు విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్య తపై అవగాహన కలిగించా లని డిఆర్డిఎ పీడీ తులసి అన్నారు. పీడీ ఛాంబర్‌లో రిజర్వు బ్యాంక్‌ఆఫ్ ఇండియా రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను పీడీ, ఎల్‌డిఎం హరీష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచనల మేరకు సోమవారం ఈ నెల 26 నుండి శుక్రవారం నుంచి 1వ తేదీ వరకూ ఆర్థిక అక్షరాస్యతపై వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలకు, యువతకు, విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఎంతో అవసరమన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత అవగాహనా కార్యక్రమాలు 2016 నుండి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది 'మేక్ ఏ రైట్ స్టార్ట్– బికం ఫైనాన్షియల్లి స్మార్ట్' అనే నినాదంతో ఈ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందిస్తున్నామన్నారు. ఈ ఆవిష్కరణలో చిత్తూరు లోని వివిధ బ్యాంక్ శాఖల బ్రాంచ్ మేనేజర్ లు పాల్గొన్నారు.

భూ కబ్జాదారుడు సిద్ధుల రవిని అరెస్టు చేయాలి..!

- గుడిసెలు తొలగించిన ఎర్రగుట్టపైనే స్థలాలు చూపాలి
- సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి
- 15 రోజుల్లో పేదలకు న్యాయం చేస్తామని డిఆర్‌ఓ హామీ





డిఆర్‌ఓ కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న పేదలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: కరకంబాడీ వద్ద ఎర్రగుట్టపై పేదలేసుకున్న గుడిసెలను తొలగించినందుకు, అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసిస్తూ బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో వందలాది మందితో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జరిగింది. దాదాపు 300 మంది పేదలు తమకు న్యాయం చేయాలంటూ ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా రోడ్డుపై కూర్చొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ ఏమి నేరం చేశారని పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చివేశారని, పేదల పక్షాన పోరాడుతున్న సిపిఎం నేతలను ఎందుకు అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. భూ కబ్జాదారుడైన సిద్ధులు రవి పైన పోలీసుల ప్రతాపం చూపించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం పట్టాలి ఇచ్చిన, నివాస స్థలాలు అనువైన ప్రాంతంలో చూపకపోవడంతో పేదలు గుడిసెలు వేయాల్సి వచ్చిందని అన్నారు. కబ్జాదారులు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో జగనన్న పట్టాదారులకి స్థానికంగా స్థలాలు చూపించాలని కోరారు. పేదలకు స్థలాలు చూపేంతవరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిఆర్‌ఓ పెంచల కిషోర్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం డిఆర్‌ఓ మాట్లాడుతూ 15 రోజుల్లో పేదలకు స్థలాలు చూపిస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం నాయకులు టి.సుబ్రమణ్యం, మాధవ్, జయచంద్ర, సాయిలక్ష్మి, వేణుగోపాల్, బుజ్జి, పార్థసారథి రెడ్డి, హరి, రాజశేఖర్, సెల్వరాజు, శివానందం, సత్య, ప్రకాష్, శీను సుజాతమ్మ, మమత, కుమారి, మునిరత్నం, బాదుల్లా, మోదీను, అమీదు పాల్గొన్నారు.

పారిశుధ్యపనుల తనిఖీ

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్ : నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ డా. జె అరుణ బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ 31, 32 వార్డు సచివాలయాల పరిధిలో గురుబేకరీ వీధి, వినాయక గుడి వీధి, ఆర్కాడు వీధి, గంగా క్రాస్, కావేరీ క్రాస్, ఎ, బీ క్రాస్ వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. పారిశుధ్య కార్మికుల హాజరు నమోదు, హాజరు రిజిస్టర్ లను తనిఖీ చేశారు. కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో వ్యర్థాలను తడి పొడిగా సేకరించాలన్నారు. వ్యర్థాలను సగ్రిగేషన్ చేయడంపై పారిశుధ్య కార్మికులతో పాటు, గృహస్థులకు అవగాహన కల్పించడం ద్వారా తడి, పొడి వ్యర్థాల సేకరణ మెరుగ్గా చేపట్టాలన్నారు. వ్యర్థాలను క్షేత్రస్థాయిలోనే సులభంగా వేరు చేసేలా కార్మికులు అవగాహన పెంచుకోవాలన్నారు. వార్డు స్థాయిలో ట్రేడ్ లైసెన్స్ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, పారిశుధ్య పనులు పక్కాగా పర్యవేక్షించాలని వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో విద్యుత్ ఆదాపై అవగాహన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: స్థానిక చిత్తూరు జిల్లా పండ్ల పరిశ్రమ సమైక్య వారికి ఎనర్జీ కన్జర్వేషన్ ఆడిటింగ్ అండ్ ప్రాక్టీసెస్ పై కేబీఆర్ మ్యాంగో భవన్‌లో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం పరిశ్రమలో విద్యుత్తును ఎలా ఆదా చేయాలి? ఎంత మేరకు విద్యుత్ మోటార్లను ఉపయోగించాలి? కెపాసిటర్లు ఎంత సామర్థ్యం వరకు పరిశ్రమలలో ఉపయోగించి నాణ్యమైన విద్యుత్తును పరిశ్రమలోని అన్ని యంత్రాలకు సరఫరా చేయాలి? విద్యుత్తును ఎలా ఆదా చేయాలి? విద్యుత్ శాఖ బిల్లులలో పవర్ ఫ్యాక్టర్ వల్ల ఇతర అపరాధ రుసుములు పడకుండా ఏ విధమైన కొత్త పరికరాలు ఉపయోగించాలి ? అనే చాలా విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. దీనిపై గురువారం వివిధ ఫ్యాక్టరీలను సందర్శించి ఈ పరికరాలు ఏ విధంగా ఉపయోగించాలో అక్కడ ఉన్న కార్మికులకు శిక్షణ కూడా ఇస్తారని, ఇందులో ఏపిఐటిసిఐ నుంచి శ్రీనివాసరావు , గోపాల్ రావు, టెక్నికల్ కమిటీ నుంచి అహ్మద్ పాల్గొన్నారు. జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య నుంచి యాజమాన్యం ,ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ స్టాఫ్ పాల్గొన్నారు. ఇందులో సమాఖ్య కార్యదర్శి కట్టమంచి బాబి, అధ్యక్షులు బాలకృష్ణ రెడ్డి , తలుపులపల్లి బాబు రెడ్డి ,ఇతర పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహకారం మరువలేనిది

- నగరి టైలర్స్ సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: ముఖ్యమంత్రి సహకారం మరువలేనిదని, జగనన్న చేదోడుతో ఆయన ఆదుకుంటున్నారని నగరి టైలర్స్ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని సంఘం సభ్యులు ఓంశక్తి ఆలయం నుంచి బస్టాండు ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష కార్యదర్శులు అయూబ్ బాషా, వీరయ్య మాట్లాడుతూ జగనన్న చేదోడుతో టైలర్లను ఆదుకుంటున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ కార్యాలయం వద్ద కేక్ కత్తిరించి సంబరాలు చేసుకున్నారు. సీనియర్ టైలర్లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ టైలర్స్‌కు అంటూ సాయం చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న సాయం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు ఉమాపతి, ఉపకార్యదర్శి జగన్నాథం, కోశాధికారి కె. కృష్ణయ్య, సభ్యులు గణేశ్, వరదరాజులు, నటరాజ్, హమీదు, హాతింబాయ్, రాజ, మునిరత్నం, శ్రీనివాసులు, నాగూరు, ధనరాజ్, శేఖర్ పాల్గొన్నారు.

సెంథిల్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూర్ పట్టణం మిట్టూరు వాసి వీ.ఎన్. సెంథిల్ తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, గణాంకశాస్త్ర (సాంఖ్యాకశాస్త్రం) విభాగం లో పరిశోధక విద్యార్థి వీ.ఎన్. సెంథిల్, ఆచార్య బీ.సరోజమ్మ మార్గదర్శకత్వంలో "రిగ్రెషన్ మోడల్స్ ఫర్ టైం సిరీస్ ఎనాలిసిస్ అండ్ ఫోరేకాస్టింగ్ మెథడ్స్ యూసింగ్ అట్మోస్ఫెయిరిక్ డేటా", అంశం పై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్టు వర్సిటీ పరీక్షల నియంత్ర ణాధికారి దామ్లా నాయక్ తెలిపారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కార్వేటినగరం: పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం చేపట్టే పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని ఎంపీపీ లత అన్నారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లకు ఎంపీడీవో సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో అవ గాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లతబాలాజీ మాట్లాడుతూ 0–5 సంవత్సరాల లోపు చిన్నారులను విధిగా గుర్తించి మార్చి 3,4,5 వ తేదీల్లో జరిగే పల్స్‌పోలియోలో రెండు చుక్కలు వేయించాలని సూచించారు. బస్ స్టాండ్లు, వలస కూలీలు, ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికుల పిల్లలను గుర్తించి తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. వైద్యాధికారి హేమశ్రీ మాట్లాడుతూ మండలం లో 35 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశారని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకుని పోలియో రహిత సమాజా నికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయకుమార్, అంగన్‌వాడీ పర్యవేక్షకులు ఇందిరా, షామిని, వైద్య సిబ్బంది అంబరిషీరాజు, ఏఎన్ఎంలు పలువురు పాల్గొన్నారు.

మసీదులకు మహర్దశ

- రూ. 1.97 కోట్లతో నియోజకవర్గంలో మసీదుల నవీకరణ
- ఫలించిన మంత్రి ఆర్కేరోజా కృషి
- నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల
- ఇప్పటికే పలు ఆలయాల అభివృద్ధి

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: నియోజకవర్గంలో ఇప్పటి వరకు చూడని అభివృద్ధి పనులు వరుసగా జరుగుతున్నాయి. కులమత భేదాలు, పక్షపాతాలు లేకుండా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. చేపట్టవలసిన పనుల గుర్తింపు, అందుకు అవసమైన నిధులు మంజూరు చేసుకోవడంలో మంత్రి ఆర్కేరోజా తనకు తానే సాటిగా నిలుస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాల నిర్మాణం, ఆధునికీకరణ చేపట్టిన విషయం విదితమే. ప్రస్తుతం నియోజకవర్గంలోని మసీదుల పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నవీకరణకు నిధులు మంజూరు చేయించారు. నియోజకవర్గంలోని 17 మసీదుల నవీకరణకు రూ.1.97 కోట్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వ కార్యదర్శి ఇంతియాజ్ జీవో నెంబరు 46 మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో నగరి మండలం వేలావడి మస్జీద్ ఇ మొహమ్మదీయ, ఎంఎస్ పాళెం జామియా మసీదు, ఎస్వీపురం మసీద్ రుకైయా, నగరి పట్టణంలోని జామియా మసీదు, మక్కా మసీదు పుత్తూరులోని మసీద్ ఇ మక్దాస్, జామియా మసీదు, ఈద్గామాస్క్, గౌసియా మసీదు, మసీద్ ఇ సుల్దానా, ఈద్గా మాస్క్, మసీద్ ఇ ముక్దాస్, జామియా మసీద్ వహేదా, ఖాదర్‌వలీ దర్గా, వడమాలపేటలోని అహెల్ ఇ సున్నత్ జమాత్ మసీదు, నిండ్ర మండలంలోని మస్జిద్ ఇ మొహమ్మదీయ జమాద్, విజయపురం మండలం కోసలనగరంలోని మసీద్ ఈ అక్సాలకు సంబంధిత నవీకరణ పనులు జరగనున్నాయి. ఇప్పటికే పుత్తూరులో రూ.2.41 కోట్ల నిధులతో మహత్తరంగా షాదీ మహల్ నిర్మించారు. నగరిలోని షాదీమహల్ నవీకరణ చేపట్టనున్నారు. ఇదిగాక ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హజ్



నిధుల మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్న మంత్రి రోజా

యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులకు 80 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఇమామ్‌లకు అందించే సహాయాన్ని రూ.5 వేలు నుండి 10 వేలకు పెంచారు. వక్ఫ్ బోర్డు, ముస్లిం మైనారిటీలకు సంబంధించిన స్థిర, చర ఆస్తులను రీసర్వే చేయించి వారి ఆస్తులను పరిరక్షిస్తున్నారు. మదర్సాలలో చదివే ముస్లిం పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేశారు. మోడ్రన్ ఎడ్యుకేషన్ ఇస్తున్న మదర్సాలకు అమ్మ ఒడి, విద్యా కానుక పథకాలు వర్తింప చేసింది కూడా ప్రస్తుత ప్రభుత్వమే కావడంతో ఇంతలా తమకు సహకారం ఏ ప్రభుత్వం అందించలేదని ఇది తమపాలిట సువర్ణ పాలని ముస్లిం సోదరులు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకొస్తే రాష్ట్రం, దేశం అభివృద్ధి'

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: కాంగ్రెస్ అధికారంలోకొస్తే రాష్ట్రంతో పాటు దేశం కూడా బాగుపడుతుందని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ నారాయణస్వామి, రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ నరసింహులు పేర్కొన్నారు. గంగాధర నెల్లూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి నెల 1 తేదీన తిరుపతిలో నిర్వహించనున్న కాంగ్రెస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. మోడీ అరాచక పాలనతో దేశం చిన్నాభిన్నమై పోయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రత్యేక హోదా వస్తుందని, యువతకు నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రులుగా పనిచేసినా రాష్ట్ర అభివృద్ధి అంతంత మాత్రమే అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసు, రాష్ట్ర



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఓబీసీ సెల్ కార్యదర్శి బండ్ల సుబ్బరాయులు, నేతలు చంద్రబాబు, కన్నన్, హుమేష్, తులసిమణి, పుష్పరాజ్, జయ చంద్ర, నాధముని రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాతో రైతులను దగా చేశారు

- రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి గౌని వారి శ్రీనివాసులు

ప్రజాశక్తి -శాంతిపురం: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతు భరోసా పేరిట రైతులను నిలువునా ముంచారని రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి రైతుకూ ఐదేళ్లలో రూ.67,500 ఇస్తామని చెప్పి రూ.37,500కు కోత పెట్టారన్నారు. దీంతో ఒక్కో రైతుకు ఐదేళ్లలో రూ.30వేలు ఎగనామం పెట్టారన్నారు. చంద్రబాబు పాలనలో రైతు రుణమాఫీ, అన్నదాత సుఖీభవ ద్వారా 21 వేల కోట్ల రూపాయలు లబ్ధి చేకూర్చారని 15,278 కోట్ల రూపాయలు ఖర్చు చేశారన్నారు. రైతు భరోసా కింద ఏడాదికి ఒకసారి 13,500 రూపాయలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి మూడు దఫాలుగా 7,500 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర నిధులను కూడా తన ఖాతాలో వేసుకుంటూ రైతులను వంచిస్తున్నారన్నారు. 64 లక్షల మందికి రైతు భరోసా వర్తింప చేస్తామని హామీ ఇచ్చి 52 లక్షలకు కుదించారని, 15.36 లక్షల మంది కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పి లక్షకు కుదించి రైతులకు కులాలు ఆపాదించి న చరిత్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిది అన్నారు. చంద్రబాబు రైతు



గౌనివారి శ్రీనివాసులు

రుణమాఫీ, అన్నదాత సుఖీభవ కింద మొత్తం ఐదేళ్లలో ఒక్కో రైతుకు రూ.1,15,000 వరకు లబ్ధి చేకూరి ఉండేదన్నారు. ఆక్వా రైతులకు, ఉద్యాన రైతులకు అందించే డ్రిప్ ఇరిగేషన్‌ను అటకెక్కించారన్నారు. పాడి రైతులకు లీటరు పాలుకు నాలుగు రూపాయలు బోనస్ ఇస్తామన్న హామీని అటకెక్కించి గుజరాత్‌కు చెందిన అమూల్ కోసం రూ.6 వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని ఆరోపించారు. కరువుపై నిర్లక్ష్యం వహించి ధాన్యం రైతులను దోచుకుని ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. సున్నా వడ్డీ పావలా వడ్డీలను రద్దుచేసి రైతులను నిలువునా నట్టేట ముంచేసారని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలన లో రైతులు అన్ని విధాలా నష్టపోయారని, చంద్రబాబు ప్రభుత్వం హయాంలోనే అన్నదాతలకు మేలు జరుగుతుందని రైతులు బాగుపడాలంటే జగన్ పోవాలన్నారు.

జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

టిడిపి అభ్యర్థి గురజాల జగన్‌మోహన్

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: లాండ్ సౌండ్ మైనింగ్ దోచుకున్నారే తప్ప వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యం చిత్తూరు నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్ మోహన్ బుధవారం పేర్కొన్నారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను 450 కోట్ల రూపాయలతో 87 శాతం అభివృద్ధి పనులు టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగాయే తప్ప ఈ వైసిపి ప్రభుత్వంలో కుప్పం అభివృద్ధికి నోచుకోలేదు. పెండింగ్ పనులు పూర్తి చేయకుండానే ప్రజలను మభ్యపెడుతూ హడావిడిగా పెండింగ్‌లో ఉన్న కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు తాత్కాలిక గేట్లు ఏర్పాటు చేసి ఒక్క రోజుకూడా గడవక ముందే తాత్కాలిక గేట్లు తొలగించడం దారుణమన్నారు. ఇది వైసిపి ప్రభుత్వం రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలను మభ్యపెడుతోందని, కుప్పంలో చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధి పనుల్లో భాగంగానే కుప్పం యూనివర్సిటీని స్థాపించి వ్యవసాయ క్షేత్రాలను అభివృద్ధి చేసి దేశంలోనే కుప్పం నియోజక వర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారన్నారు. శాంతియుతమైన కుప్పాన్ని ఫ్యాక్షన్ ప్రాంతంగా మార్చేం



దుకు జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, టీడీపీ ప్రభుత్వ హయాంలో కుప్పం చాలా ప్రశాంతం గా ఉండేదని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కుప్పంలో హింసను రెచ్చగొట్టే ప్రయ త్నం చేశారన్నారు. కుప్పం కాలువ మరమ్మతు పనుల పేరుతో వేల కోట్లు వైసిపి నాయకులు దోచుకుతిన్నారని దుయ్యబట్టారు. కృష్ణా, నాగార్జున సాగర్ జలాల పంపకంపై తెలంగాణతో చర్చలు జరపడంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని, జగన్ మోహన్ రెడ్డి తన సొంత నియోజకవర్గం అయిన పులివెందులకు సాగునీరు, తాగునీరు ఇచ్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. రాయలసీమలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను ఎన్టీఆర్ ప్రారంభించగా, చంద్రబాబు నాయుడు అభివృద్ధిని కొనసాగిం చారన్నారు. కానీ, జగన్ మోహన్ రెడ్డి మాత్రం రాయలసీమకు చేసిందేమీ లేదన్నారు. జగన్ మోహన్ రెడ్డి తన 48 ఏళ్ల పాలనలో కుప్పంకు చేసిందేమీ లేదని, మళ్లీ తప్పుడు వాగ్దానాలతో వై ఎస్ జగన్ ప్రజల ముందుకు వస్తున్నాడని, ప్రజలు మరోసారి మోసపోకుండా అభివృద్ధి చేసే నాయకులకే పట్టం కట్టాలన్నారు.

క్రైం న్యూస్

అక్రమ మద్యం కేసులో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అరెస్ట్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కర్నాటక అక్రమ మద్యం కేసులో టిడిపి సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు కోకా ప్రకాష్‌నాయుడ్ని పలమనేరు పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు మంగళవారం ముందస్తు సమాచారం మేరకు నంగిలి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు రాత్రి తొమ్మిది గంటల సమయంలో కర్నాటక నుండీ సుజికీ కారు వచ్చింది. అతడ్ని ఆపి విచారించారు. తాను సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులుగా చెప్పడంతో పోలీసులు కారును తనిఖీ చేయగా వెనక డిక్కీలో పెద్ద మొత్తంలో కర్నాటక మద్యం పట్టుబడింది. పట్టుబడ్డ కర్నాటక మద్యం విలువ రెండు లక్షలుంటుందని పోలీసులు అంచనా వేశారు. రానున్న ఎన్నికల కోసం మద్యం తీసుకొస్తున్నట్లు పలమనేరు డిఎస్పీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కోకా ప్రకాష్‌నాయుడిపై బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్‌లో ఐదు, అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఓ క్రిమినల్ కేసు, మొదనపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులున్నట్లు తెలిపారు. అక్రమ మద్యం తరలింపు కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పలమనేరు డిఎస్పీ తెలిపారు.

యాదవులంతా గురజాల జగన్‌మోహన్ వైపే

జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్



గురజాల జగన్‌మోహన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనల చిత్తూరు నియోజక వర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్ మోహన్‌కు యాదవుల సంఘం అండగా నిలుస్తుందని జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ పేర్కొన్నారు. చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గురజాల జగన్ మోహన్ పేరును ఖరారు చేస్తూ అధిష్టానం ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా బుధవారం శ్రీధర్ యాదవ్, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, జిల్లా యాదవ నాయకులతో గురజాలను మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానం చేశారు.

వేపంజేరి ఆలయట్రస్టీ శ్రీధర్ అనారోగ్యంతో మృతి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు మండలంలోని వేపంజేరి శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయ ట్రస్టీ, న్యాయవాది కెఎస్ శ్రీధర్ (81) బుధవారం మృతి చెందారు. ఆయన గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడతూ తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంత్యక్రియలు తిరుపతిలో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు అడ్వకేట్ వాసు తెలిపారు. ఆయన మృతితో వేపంజేరి గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు, శోకసంద్రంలో మునిగిపోయారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి: ఎంపీడీవో

ప్రజాశక్తి -జిడి నెల్లూరు: పాలసముద్రం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో ఎం. రామనాథరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిష్టర్లను పరిశీలించిన ఆయన సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా ? లేదా అని ఆరా తీశారు. ఏ ఏ సమస్యలు ఎక్కువగా సచివాలయానికి వస్తున్నాయా? అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సచివాలయంలో అందాల్సిన సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. సచివాలయానికి వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం ఆయన పాలసముద్రం గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయ సిబ్బంది గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు మరుగుదొడ్లు సౌకర్యం, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎంపీడీవోని కోరారు. స్పందించి ఎంపీడీవో సమస్య పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి ధరణిని ఆదేశించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్ : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ నరసింహమూర్తి బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ఉండేందుకు చేపట్టే చర్యల్లో భాగంగా ఆయన రౌడీ షీటర్లతో సమావేశమయ్యారు. ఎన్నికల సమయంలో ఎలా నడుచుకోవాలో, నడుచుకోకుంటే ఎలాంటి చర్యలు తీసుకోవాల్సి వస్తుందో వారికి విపులంగా వివరించారు. పూర్తి స్థాయిలో తమ నిఘా ఉంటుందని దానికనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అడవికి నిప్పు పంట పొలాలకు ముప్పు



కాలిపోతున్న అటవీప్రాంతం

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని పత్తికొండ ప్రాంతంలో ఉన్న అటవీ ప్రాంతంలో ఎవరో గుర్తు లేని వ్యక్తులు నిప్పు అంటించడంలో పరిసర ప్రాంతాలలోని అప్పిశెట్టి పల్లి, పత్తికొండ, పొన్నమ్మక నపల్లి మా , మడుగు గ్రామాల సమీపంలోని వ్యవసాయ పొలాలు సైతం కాలిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా ఈ ప్రాంతంలో అడవికి నిప్పు అంటుకోవడంతో అటవీ సమీపాన ఉన్న పంటపొలాల సమీపం పూర్తిగా కాలిపోతున్నాయని దీంతోపాటు మీద వెళుతున్న వాహనదారుల సైతం ఇబ్బందులకు పడుతున్నారన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు రెండు రోజులు ముందే పరిసర గ్రామ ప్రజలు సమాచారం అందించినా ఇంత వరకు సంఘటన స్థలానికి చేరుకోకపోవడంతో ఈ అటవీ ప్రాంతం పూర్తిగా కాలిపోయిందని ఎండ వేడిమికి భారీ వృక్షాలు సైతం నేల కూలిపోయాయని, అయినా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరంగా ఉందని సామాన్య అధికారులు స్పందించి వెంటనే ఈ మంటలు ఆర్పివేయాలని పరిసర ప్రాంత వాసులు కోరుతున్నారు.

మాజీ మంత్రి అమరనాథరెడ్డికి ఘనస్వాగతం



అమరనాథరెడ్డికి స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం అయిన బైరెడ్డిపల్లి లో మాజీ మంత్రి అమరనాథ రెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికంగా టిడిపి, జనసైనికులు సైతం ఆయనకు ఘన స్వాగతం పలికారు. బైరెడ్డిపల్లిలోని అన్ని వీధులలో పర్యటన చేస్తూ ఇంటింటికి వెళ్లి ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి ఆధ్వర్యంలో భవిష్యత్తులో చేపట్టనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రజల వ్యక్తిగత సమస్యలను, స్థానిక సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. చెక్ పోస్ట్ కూడలిలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, జనరల్ సెక్రెటరీ సుబ్రహ్మణ్యం శెట్టి, భువన చంద్ర గౌడ్, అరుణ్, జమిల్ బాషా, మణి, ఖాదర్ ఖాన్,రాజు, విజయ్, మురళి, డి.హరి, కిరణ్, దాములతో పాటు జనసేన నాయకులు పసుపులేటి దిలీప్ కుమార్, పూల చైతు , నాగరాజు, చైతన్యకుమార్, రమేష్ లతో పాటు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐ మోహన్ కుమార్‌కు ప్రముఖుల అభినందనలు



మోహనకుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మోహన్ కుమార్ ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు సీఐగా ప్రమోషన్ రావడంతో ఇక్కడ నుండి బదిలీ అవుతున్న సందర్భంలో ఆయనకు మండలంలోని ప్రముఖులు సంతోషం వ్యక్తం చేశారు. ఆయనను గంగినాయన పల్లి సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి కండువా కప్పి పూలమాలవేసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఏఎస్ఐ వెంకయ్య , సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

శాస్త్రవేత్తల సేవలు అమూల్యం

సైన్స్‌డేలో పలువురి ప్రశంస




కార్వేటినగరంలో సైన్స్‌డేను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కార్వేటినగ రం: శాస్త్ర వేత్తలే నిజమైన దేవుళ్లని, ప్రతి మనిషి జీవితం లో విజ్ఞాన శాస్త్రం ఒక భాగమైందని, ఆ శాస్త్ర ఫలాలు అభివృద్ధిలో భాగ స్వామ్యం కావడానికి శాస్త్రవేత్త ల కృషి అమూల్యమని కత్తెరప ల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం హేమారెడ్డి, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం గాయత్రీదేవి అన్నారు. శాస్త్రవేత్త సీవీ రామన్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ సైన్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ శాస్త్రవేత్త సీవీ రామన్ చిన్న వయస్సులోనే కనుగొన్న రామన్ ఎలెరక్ట్ తర్వాత ప్రపంచ విజ్ఞాన శాస్త్రంలో అనేక మార్పులు సంభవించాయన్నారు. దీని వల్ల సైన్స్ కొత్తపుంతలు తొక్కిందన్నారు. ప్రతి విద్యార్థి శాస్త్రవేత్త కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. డీఎంపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, హెచ్ఎం కేశవులు ఆధ్వర్యంలో ప్రదర్శించిన సైన్స్ డే అక్షరాలు చూపరులను ఆకర్షిం చేలా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పంలోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అన్నపూర్ణ శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే స్వభావాన్ని పెంచుకోవాలని, హేతుబద్ధంగా ఆలోచించాలని, మూఢనమ్మకాలను నమ్మవద్దని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి ప్రభాకర్ రావు, ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ పూడి వెంకటేశు రామన్ ప్రభావం గురించి వివరించారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా కళాశాలలోని వివిధ సైన్స్ విభాగాలు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

శాంతిపురం: మండల పరిధిలోని పరమహంస యోగానంద విద్యాలయ సీబీఎస్ఈ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులతో సమానంగా సైన్సును కూడా చక్కగా చదవడం వల్ల విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రాచీన కాలం నుంచి నేటి వరకు సైన్స్ లో వచ్చిన మార్పుల వలన మానవులు గణనీయమైన ప్రగతిని సాధించారని, సైన్స్ లేనిదే ప్రపంచం లేదని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు నారాయణరెడ్డి సైన్స్‌డే గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కొంతమంది విద్యార్థులు గొప్ప శాస్త్రవేత్తల వేషధారణలో వచ్చి అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సైన్స్ డిపార్ట్మెంట్‌కు చెందిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు సంపత్ ,నలిని అక్షత, ప్రియాంక , పల్లవి, మౌనిక, షబ్రిన్, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లిలో

బైరెడ్డిపల్లి: సైన్స్‌డే సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థి ని విద్యార్థులచే ప్రయోగాలు నిర్వహిం చారు. వాటిని జిల్లా పరిషత్ బాలుల పాఠశాల బైరెడ్డిపల్లిలో ప్రధానోపాధ్యా యులు విశ్వనాధయ్య ఆధ్వర్యంలో మండలంలోని సిఆర్‌సి పరిధిలో ఉన్న పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థులు అక్కడికి చేరుకొని విద్యార్థిని విద్యార్థులు సైన్స్ పై చిత్రీకరించిన వివిధ అంశాలు చిత్రలేఖనం ప్రదర్శించే బొమ్మలు తీసుకొని పాఠశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తూ విద్యార్థులు చేసిన వివిధ కార్యక్రమాలను పరిశీలించి విద్యార్థులకు బహుమతులు అందే విధంగా నిర్ణయించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు విశ్వనాధయ్య మాట్లాడుతూ సైన్స్ పరిశోధనలో భారతదేశం గతంలో వెనుకంజలో ఉండేదని ప్రస్తుతం వివిధ దేశాలకు గుర్తించి భారతదేశంలో కూడా సైన్స్ పరిశోధకులు ఉన్నారని ప్రయోగాలు చేసిన తర్వాతే గుర్తించారు. సాధన తోనే సైన్స్ విద్య క్రమశిక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం ఏపీ రెసిడెన్సి స్కూల్, జిల్లా పరిషత్ బాలుల ఉన్నత పాఠశాల విద్యార్థులు సైన్స్ లో పాల్గొని ఎక్కువ బహుమతులు పొందారు. వారికి ప్రధానోపాధ్యాయులు చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు సాయి లీల, సుబ్రహ్మణ్యం, మండలంలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్తూరు నగరంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఘనంగా సైన్సు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వివిధ రకాల సైన్సు నమూనాలు విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు నమూనాలు పలువుర్ని అకట్టుకున్నాయి.



బృందావన్ స్కూల్లో

స్థానిక స్థానిక సంతపేట లోని బృందావన్ స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవ అంగరంగ వైభవంగా జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ శైలజా కుమారి తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు వివిధ రకాల వర్కింగ్ మోడల్ నమూనాలను ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు. వీటితో పాటుగా రోబోటిక్ వర్కింగ్ మోడల్ అని కూడా ప్రదర్శించారు. జంక్ ఫుడ్ వాడడం వల్ల వచ్చే నష్టాలను ఆరోగ్యకరమైన పదార్థాలను తినడం వల్ల వచ్చే లాభాలను చిన్నారులు నమూనాలను తిలకించడానికి వచ్చిన తల్లిదండ్రులకు ఉపాధ్యాయ బృందానికి తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యారినివిద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారని తెలిపారు.

స్థానిక రామ్‌నగర్ కాలనీలోని హార్వార్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో ఘనంగా సైన్సు దినోత్సవ వేడకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు నమూనాలను పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్ పరిశీలించి విద్యార్థినివిద్యార్థులను అభినందించారు. దేశ భవిషత్ సైన్సుపై ఆధారపడి ఉందని నేడు మనం పొందుతున్న అనేక సౌకర్యాల వెనుక సైన్సు పాత్ర కీలకమన్నారు. సైన్సు అభివృద్ధి చెందిన దేశాలు ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతాయన్నారు.

స్థానిక సుందర రాజపురం విజయం సిబిఎస్సి పాఠశాలలో భారతీయ శాస్త్రవేత్త డాక్టర్ సివి రామన్ జన్మదినాన్ని పురస్కరించుకొని విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ సాంకేతిక నమూనాలను ప్రదర్శించారు. వీటిలో రామన్ ఎఫెక్ట్, హోమోగ్రామ్, హిమోదయాలసిస్, మానవ రోబో, గాలిమర విద్యుత్, వర్షపు నీటి సంరక్షణ, సూక్ష్మ నీటిపారుదల, సౌర విద్యుత్ వినియోగం నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత డాక్టర్ తేజ మూర్తి, అకాడమిక్ డైరెక్టర్ శైలజ మూర్తి ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించారు. భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త సివి రామన్ మనకెంతో ఆదర్శప్రాయులని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కౌసల్య, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు ,విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.